క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లలితానగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, 11కేవీ జయశ్రీ కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు, 11కేవీ ప్రశాంతిహిల్స్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 1 నుంచి 2.30వరకూ విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: బాలాపూర్, కొత్తపేట ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బాలాపూర్ ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, పహడీషరీఫ్ పరిధిలోని కొత్తపేట ఫీడర్ పరిధిలో 12.30నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని కాలనీలు, ప్రజలు, వినియోగదారులు సహకరించగలరని కోరారు.

భక్తుల ఇలవేల్పు సూర్యగిరి ఎల్లమ్మ



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు ఇలవేల్పుగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ఉదయం నుంచే భక్తులు దర్శనార్థం క్యూలైన్లో వేచిఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం, నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక శ్రీ సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్న స్వామి వారు

తుక్కుగూడ: జిన్నాయిగుట్ట ఛత్రగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మూడో రోజు అభిషేకం, ప్రత్యేకాలంకరణ, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని రావిర్యాల గ్రామంలో అత్యంత భక్తి శ్రద్ధల మధ్య ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా తిరు కల్యాణం



కల్యాణంలో సంజయ్‌గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి

మీర్‌పేట: జిల్లెలగూడ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి తిరు కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ ఫౌండర్ ఛైర్మన్ సంజయ్ గోపాల్ సైంచర్, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్‌లు బొక్క రాజేందర్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 23, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 28, ఆలు 32, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 18, అరటి 08, చిక్కుడు 70, ఆర్వి 45, మునగ 45, చిలగడదుంప 70, బీట్‌రూట్ 19, కీర 18.

ఆ రోడ్డంతా గుంతలమయం



అగర్‌మియాగూడ-తిమ్మాపూర్ మధ్య రోడ్డు పరిస్థితి



కంకర తేలిన అగర్‌మియాగూడ రోడ్డు

అగర్‌మియాగూడ నుంచి తిమ్మాపూర్ వరకు..

- కంకర తేలి పాడైన రోడ్డు
- కిలోమీటర్ మేర అదే పరిస్థితి
- ఇబ్బందుల్లో వాహనదారులు, స్థానికులు
- పట్టించుకోని అధికారులు

కందుకూరు: ప్రధాన లింకు రహదారి గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం కిలోమీటర్ మేర అభివృద్ధి చేస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదు. చాలా ఏండ్ల క్రితం నిర్మించి మళ్లీ ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో కంకర తేలి రోడ్డు పాడైంది. ప్రస్తుతం వాహనాలు వెళ్లలేని దుస్థితిలో తయారైంది. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు ఆటంకిగా మారాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కంపచెట్లను తొలగించే వారు కరువయ్యారు. వాహనదారులు ఆవైపుగా వెళ్తుంటే అవి తగిలి గాయాల పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేయడంలేదు

అగర్‌మియాగూడ నుంచి తిమ్మాపూర్ గ్రామం మధ్య నాలుగున్నర నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆ రెండు గ్రామాల మధ్య దాదాపుగా పద్నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం బీటీ నిర్మించింది. ఆ తర్వాత కనీసం పాడైన రోడ్డును పట్టించుకోవడం లేదు. మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో ప్రస్తుతం ఆ రహదారి అగర్‌మియాగూడ వైపు దాదాపుగా కిలోమీటర్ మేర గుంతలుగా తయారైంది. దీంతో వాహనదారులు ఆ రహదారిపై ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నారు. లేమూరు నుంచి తిమ్మాపూర్ వెళ్లే రహదారి కలిసే ప్రాంతంలో కొంత మేర వెంచర్ నిర్వాహకులు రోడ్డు నిర్మించారు. కేవలం అగర్‌మియాగూడ వైపు మాత్రమే కిలోమీటర్ పాడైయింది.

కలెక్టరేట్‌కు దగ్గరిదారి

అగర్‌మియాగూడ నుంచి తిమ్మాపూర్ రహదారి మరమ్మతులు చేయిస్తే అగర్‌మియాగూడ నుంచి కలెక్టరేట్ వెళ్లడానికి చాలా దగ్గరవుతుంది. తిమ్మాపూర్ మీదుగా కలెక్టరేట్ వరకు దాదాపుగా పది కిలోమీటర్ల దూరం లోపే ఉంటుంది. చుట్టూ తిరిగి వెళితే అదనంగా మరో పది కిలోమీటర్లు పెరుగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ రహదారిని సరిచేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



అగర్‌మియాగూడ నుంచి తిమ్మాపూర్ మధ్య ఒక కిలోమీటర్ మేర రహదారి అధ్వానంగా మారింది. ఆ రహదారిని అభివృద్ధి చేస్తే కలెక్టరేట్‌కు వెళ్లడానికి చాలా దగ్గరవుతుంది. అధికారులు స్పందించి నిధులు కేటాయించి సత్వరమే పనులు చేపట్టాలి.

– రేవంత్‌రెడ్డి, అగర్‌మియాగూడ

ఇప్పటికీ మంజూరు చేయలేదు

మేము గ్రామ పంచాయతీ నుంచి తీర్మాణం చేసి అగర్‌మియాగూడ నుంచి కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి నిధుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నేల స్వభావాన్ని బట్టి అర కిలోమీటర్ సీసీ, మరో అర కిలోమీటర్ బీటీ నిర్మించాలని కోరాము. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు.

– భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్, అగర్‌మియాగూడ

ఎన్నికల కోడ్ తర్వాతే..



అగర్‌మియాగూడ నుంచి తిమ్మాపూర్ మధ్య ఒక కిలోమీటర్ మేర రహదారి పాడైయిన మాట వాస్తవమే. గతంలో లేమూరు నుంచి అగర్‌మియాగూడ వరకు రూ.18 లక్షలతో రోడ్డు నిర్మించాము. ఎన్నికల కోడ్ పూర్తయిన వెంటనే పాడైన రహదారి పనుల కోసం ప్రతిపాదనలు పంపుతాము. మరమ్మతు పనులు చేయిస్తాం.

– సతీష్‌రెడ్డి, ఏఈ పీఆర్, కందుకూరు

కబ్జా నుంచి కాపాడాలి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కందుకూరు: రైతుల పొలాలకు వెళ్లే రహదారిని కబ్జా చేస్తూ, ఫాంల్యాండ్ వెంచర్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నేదునూరు రైతులు మంగళవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేదునూరు రెవెన్యూ సర్వే నంబర్లు 646, 647, 648, 651, 652, 655లో సుమారు 72ఎకరాల భూమిని విద్యుత్ సిబ్బంది కొనుగోలు చేసి, అనుమతులు లేకుండా చుట్టూ ప్రహరీ నిర్మిస్తూ పొలాలకు వెళ్లే రహదారిని సైతం కొంత మేర కబ్జా చేశారన్నారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే ఫలితం లేదన్నారు. కబ్జా చేసిన భూమిని స్వాధీనం చేసుకొని బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉన్ని వెంకటయ్య, మాజీ వార్డు సభ్యుడు ఎగిరిశెట్టి నర్సింహా, ఇ.రాకేష్‌గౌడ్, రైతులు కాసుల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ కృష్ణనాయక్, భిక్షపతి, చంద్రారెడ్డి, కె శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు పేదరికం అడ్డు

ప్రతిభకు కొదవ లేదు

- ఎంపీసీలో 969 మార్కులతో ఔరా అనిపించిన పల్లవి
- దాతల సాయం కోసం ఎదురు చూపు



పల్లవిని అభినందించిన ఉపాధ్యాయులు (ఫైల్)

హుడాకాంప్లెక్స్: చదువుల సరస్వతి పల్లవికి లక్ష్మీకటాక్షం కరువైంది. ఉన్నత చదువులకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారాయి. దాతలు ముందుకొచ్చి ఆదరించాలని వేడుకోలు. సరూర్‌నగర్ కామేశ్వర్‌రావు కాలనీకి చెందిన వంట మనిషి మేకల రాములుకు నలుగురు కుమార్తెలు. ఆయన ఆర్థిక పరిస్థితి అంతంతే. చిన్న కుమార్తె పల్లవి సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఎంపీసీ కోర్సు చదివింది. రెండేళ్ల కాలంలో ఏ రోజు కూడా కాలేజీకి గైర్హాజరు కాలేదు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000కి 969 మార్కులు సాధించి అందరినీ అబ్బురపరిచి శభాష్ అనిపించుకుంది. కళాశాలలో మంచి మార్కులు సాధించినందుకు ఆమెను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ఆదుకోవాలి..

ఆమె ప్రతిభకు ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారింది. ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు అనువైన ఆర్థిక పరిస్థితులు లేకపోవడంతో ఆమె భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. దాతలు ఆదరించి అండగా నిలిస్తే బీకాం కంప్యూటర్ చదువుకుంటానని మనోభావం వ్యక్తం చేసింది. భవిష్యత్‌లో బ్యాంకు ఉద్యోగం సాధించి ప్రజలకు సేవచేయాలని చెబుతుంది. దాతలు ఎవరైనా సాయం చేయదలచిన వారు 8688890377 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు చేయూతనందిస్తాం

జెడ్పీటీసీ వెంకటేశ్



అనూషను అభినందిస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్

తలకొండపల్లి: ప్రతిభ గల విద్యార్థులకు చేయూత అందిస్తామని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేసి ఉన్నత చదువులు చెప్పిస్తామని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా త్రిపురాం మండలం నిలయ్‌గూడకి చెందిన అలకుంట అనూష ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూప్‌లో 967 మార్కులు సాధించింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పై చదువులు చదువుకోలేకపోతున్నది. ఈ క్రమంలో తన తల్లిదండ్రులు ఎంకన్న, శిరీషతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో జెడ్పీటీసీ ఉప్పలను కలిసి ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఉప్పల.. తన ట్రస్టు ద్వారా అనూషను చదివిస్తానని భరోసా పలికారు. ఆమె కోరిక మేరకు బీటెక్‌లో చేర్పించి ట్రస్టు ద్వారా ఫీజులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత, నాయకులు.. జ్యోతయ్య, శేఖర్ పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులు నిలిపివేయండి

స్టాండింగ్ కమిటీ సమావేశంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని ముద్వీన్ గ్రామ సమీపంలోని నల్లగుట్ట వద్ద మైనింగ్ కంపెనీ అనుమతులు నిలపివేయాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. ముద్వీన్ సమీపంలో మైనింగ్ కంపెనీ ఏర్పాటు చేయవద్దని గ్రామస్తులు నిరసన తెలుపుతున్నారని, ప్రజాభిప్రాయ సేకరణలో కూడా అప్పటి అదనపు కలెక్టర్‌ను కలిసి మైనింగ్ కంపెనీకి అనుమతులు ఇవ్వొద్దని గ్రామస్తులు కోరడం జరిగిందని సమావేశం దృష్టికి తెచ్చారు. స్పందించిన జిల్లా మైనింగ్ శాఖ ఏడీ మాట్లాడుతూ.. నల్లగుట్ట మైనింగ్‌కు ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. అదే విధంగా ఆమనగల్ నుంచి ముద్వీన్, మేడిపల్లి మీదుగా మాల్ వరకు బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని స్టాండింగ్ కమిటీ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ దృష్టికి తెచ్చినట్లు జెడ్పీటీసీ తెలిపారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



మీర్‌పేట: రాజీవ్‌గాంధీ వర్ధంతిలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, తదితరులు

నియోజకవర్గంలోని ఆయా మండల కేంద్రాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లోని వార్డు ఆఫీసుల్లో, వాడవాడలో రాజకీయ నాయకులు, కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడారు. ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కొనియాడారు. కందుకూరులో జరిగిన సభలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మీర్‌పేట కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



సరూర్‌నగర్: నివాళులర్పిస్తున్న శంకర్ యాదవ్, బాలకిషన్ తదితరులు



కందుకూరు: నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కృష్ణనాయక్



బడంగ్‌పేట్: నివాళులర్పిస్తున్న నాయకులు



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలో నివాళులర్పిస్తున్న రవి కుమార్ తదితరులు

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి

పహాడీషరీఫ్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ ఎ వాణిరెడ్డి సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీలోని పురాతన ఇళ్లలో ప్రజలు నివాసం ఉండొద్దన్నారు. అలాంటి భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలన్నారు. ముఖ్యంగా రోడ్లపై నీరు నిలువకుండా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్లు బ్లాక్ అయినట్లయితే వెంటనే నీరు వెళ్లేలా వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అత్యవసర సమయంలో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ (7330 877 393)కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో మేనేజర్ యెన్నం సుదర్శన్, డీఈ వెంకన్న, పారిశుద్ధ్య విభాగం అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన వాణిరెడ్డి

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు

షాబాద్: జీవులు, జనుము, పెసర, అలసంద మొదలగు పచ్చిరొట్టపైర్లు పెంచి పూత దశలో భూమిలో కలియదున్నడం ద్వారా సేంద్రియ కర్బనం పెరిగి నేల సారవంతమవుతుందని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. రేగడి దోస్వాద గ్రామంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘంలోని రైతులకు రాబోయే వానాకాలంలో పంట సాగు విధానాలపై రత్నాకర్ అవగాహన నిర్వహించారు. జీవన ఎరువులు వేయడం ద్వారా నేలలో లవణ రూపంలో కరిగి మొక్కకు అందుబాటులోకి వస్తాయన్నారు. తద్వారా రసాయన ఎరువులపై పెట్టే పెట్టుబడి కొంతవరకు తగ్గించుకోవచ్చన్నారు. ముఖ్యంగా విత్తనాల కొనుగోలు విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే కాలంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయల సాగు, నూనెగింజల సాగు, పండించిన పంట మార్కెటింగ్, సాంకేతిక పరిజ్ఞానం, పశువుల పెంపకం, మహిళకు ఉపాధి శిక్షణ, వంటి భారతీయ వరి పరిశోధన స్థానం, భారతీయ నూనె గింజల పరిశోధన స్థానం, క్రీడా కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ సహకారంతో చేయబోతున్నట్లు తెలిపారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



నిరసనలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

బడంగ్‌పేట్: తహసీల్దార్ కార్యాలయం బాలాపూర్ నుంచి బడంగ్‌పేటకు తరలించడాన్ని అఖిలపక్షల నాయకులు ఖండించారు. మంగళవారం బాలాపూర్‌లోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు బొర్ర రవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం తరలింపునకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బాలాపూర్ పేరుతో మంజూరైన అర్బన్ హెల్త్ సెంటర్, పోలీస్ స్టేషన్ మీర్‌పేట, మల్లాపూర్‌కు తరలిస్తే స్థానిక నాయకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా నాయకులు పట్టించుకొని తహసీల్దార్ కార్యాలయాన్ని బాలాపూర్‌కు తిరిగి వచ్చేలా చూడాలని కోరారు.

శోభాయాత్రను జయప్రదం చేయండి

కొత్తూరు: హనుమాన్ జయంతి సందర్భంగా మే 1న పట్టణంలో నిర్వహించనున్న స్వామివారి శోభాయాత్రను జయప్రదం చేయాలని ఏబీవీపీ, బీజేపీ నాయకులు కోరారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ ఆవరణలో సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శోభాయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌చారి, నరేశ్‌చారి, సందీప్‌సింగ్, మురళి, హర్ష, కిషోర్, మహేశ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.